దానధర్మాలకు ప్రతీక రంజాన్

ఐదున్నర దశాబ్దాలుగా పేదలకు వితరణ

చింతలపూడి : ధనిక, పేద తారతమ్యం లేకుండ ప్రతి పేద ముస్లిమూ సంతోషంగా రంజాన్ పండుగ నిర్వహించుకోవాలన్నదే ఇస్లాం ప్రబోధం. పేదలకు సాయం చేయాలన్న సంకల్పంతో రంజాన్ మాసంలో అంజుమన్ మహఫిజుల్ ఇస్లాం కమిటీ, జమా అతె ఇస్లామి హింద్‌లు సంయుక్తంగా ఐదున్నర దశాబ్దాలుగా క్రమం తప్పకుండా ఏటా పండుగ సరుకులు పంపిణీ చేస్తున్నారు. జమా అతె ఇస్లామీ హింద్‌కు విరాళాలు, జకాత్, ఫిత్రాల రూపంలో వచ్చే సొమ్ముతో జిల్లాలోని చింతలపూడి, లింగపాలెం, కొత్తపల్లి, జంగారెడ్డిగూడెం, కామవరపుకోట, తెలంగాణ రాష్ట్రం సత్తుపల్లి తదితర ప్రాంతాలకు చెందిన వందలాది పేద ముస్లిం కుటుంబాలకు ఏటా కొత్త దుస్తులు, పండుగ సరుకులు అందజేస్తుంది.

సంపదలో కొంత దానం

ముస్లింలకు నమాజ్, రోజా ప్రకారమే జకాత్ కూడా నిర్ణయమవుతుంది. దైవం కోసం, దైవ ప్రసన్నత పొందడానికి ఒక బాధ్యతగా సంపదలో కొంత మొత్తాన్ని పేదలకు అందించడమే జకాత్ ముఖ్య ఉద్దేశం. రంజాన్ నెలలోనే ముస్లింలు విధిగా జకాత్ చెల్లిస్తారు. సంపద అంటే బంగారం, వెండి, పాడి పశువులు, నగదు, పంటలు, వ్యాపార సామగ్రి, మొదలైనవి వస్తాయి. నిరుపేదలకు, రుణగ్రస్తులకు రుణభారం నుంచి విముక్తి చేయడానికి, ధర్మ ప్రచారానికి, పేద, ధనిక అంతరాలను రూపు మాపడానికి జకాత్ తోడ్పడుతుందని నమ్ముతారు. జకాత్ అంటే పరిశుద్ధ పరిచేది అని అర్థం. పేదలకు దానం చేయడాన్ని కూడా జకాత్ అంటారు. ముస్లింలకు విధించిన ఐదు ప్రాథమిక విధుల్లో జకాత్ ఒకటి. ఇలా రంజాన్ నెలలో జకాత్ చేయడం దేవునికి కృతజ్ఞతలు తెలుసుకోవడంలో భాగమని భావిస్తారు. తొలుత దగ్గరి రక్త సంబంధీకులకు ఇస్తారు. దగ్గరి బంధువులు ఆకలితో అలమటిస్తూ ఉంటే వారికి దానం చేయకుండా ఇతరులకు జకాత్ ఇస్తే అది చెల్లదని ఖురాన్ చెబుతోంది. ఆతరువాత ఇతర బంధువులు, స్నేహితులు, గ్రామంలోని పేదలకు ఇవ్వాలి. జకాత్‌లో భాగంగా పేదలకు పండగ సరుకులు, కొత్త దుస్తులు, నిత్యావసరాలు పంపిణీ చేస్తారు. సాధారణ జీవితానికి మించి ఆదాయ వనరులు ఉన్నవారు తప్పనిసరిగా జకాత్ చెల్లించాలి. తమ వద్ద అదనంగా ఉన్న ప్రతి రూ.100కు రూ.2.50 వంతున లెక్కించి చెల్లించాలి. జకాత్ మొత్తాన్ని రంజాన్ పండుగ నమాజ్‌కు ముందు రోజే పేదలకు చెల్లించాలి.



చింతలపూడిలో ముస్లింలకు దుస్తులు, నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్న దశ్యం

పస్తులు ఉండకూడదు



పండగపూట ఏ ఒక్కరూ పస్తులు ఉండకూడదు. ఆకలి విలువ తెలియజేసేదే రంజాన్ ఉపవాస దీక్ష. ప్రతి ముస్లిం చుట్టుపక్కల ఉన్న పేదలకు చేతనైన సాయం చేయాలి. మనతో పాటు సంతోషంగా అందరూ పండుగ జరుపుకునేలా దాన ధర్మాలు చేయాలి.

– ఎస్‌కె ఆజాద్‌బాబు, అజీమ్ చారిటీ చైర్మన్

70 రెట్లు అధికంగా పుణ్యం



రంజాన్ మాసంలో చేసే దాన ధర్మాలకు 70 రెట్లు అదనంతా పుణ్యం లభిస్తుంది. ప్రతి ముస్లిం విధిగా జకాత్ చెల్లించాలి. ఐదున్నర దశాబ్దాలుగా వందలాది మంది పేద ముస్లిం కుటుంబాలకు కొత్త దుస్తులు, పండగ సరుకులు అందచేస్తున్నాం.

– ఎండీ అక్బర్ అలి, చింతలపూడి జమాతె ఇస్లామి హింద్ అధ్యక్షుడు

క్లుప్తంగా

నిత్యాన్నదాన పథకానికి రూ.1.01 లక్షల విరాళం



దాత శంకర్‌కు విరాళం బాండ్ పత్రాన్ని అందిస్తున్న దుర్గాప్రసాద్

ద్వారకాతిరుమల: శ్రీవారి నిత్యాన్నదాన పథకానికి గుండుగొలనుకు చెందిన ముదేడ్ల శంకర్ శనివారం రూ.1,01,116 విరాళంగా అందజేశారు. ఆయన తొలుత కుటుంబ సభ్యులతో కలిసి స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. విరాళం సొమ్మును ఆలయ కార్యాలయంలో జమ చేశారు. దాతకు ఆలయ సూపరింటెండెంట్ దుర్గాప్రసాద్ విరాళం బాండ్ పత్రాన్ని అందించారు.

శ్రీవారి సేవలో చంద్ర కాళీ ప్రసాద మాతాజీ



చంద్ర కాళీ ప్రసాద మాతాజీకి స్వామి చిత్రపటం అందిస్తున్న ఆలయ ఈఓ మూర్తి

ద్వారకాతిరుమల: స్థానిక శ్రీవారి ఆలయాన్ని గుంటూరు జిల్లా నంబూరు కాళీ వనాశ్రమం పీఠాధిపతి పూజ్య యోగిని చంద్ర కాళీ ప్రసాద మాతాజీ శనివారం సందర్శించారు. స్వామి, అమ్మవార్లను దర్శించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ ముఖ మండపంలో అర్చకులు, పండితులు ఆమెకు స్వామివారి శేష వస్త్రాన్ని కప్పి, వేద ఆశీర్వచనాన్ని పలుకగా, ఆలయ ఈఓ ఎన్‌వీ సత్యనారాయణ మూర్తి చినవెంకన్న చిత్రపటాన్ని, ప్రసాదాలను అందజేశారు. తొలుత ఆమెకు అధికారులు, అర్చకులు మర్యాద పూర్వకంగా స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఆలయ ఏఈఓ పి.నటరాజారావు, సూపరింటెండెంట్ రమణరాజు తదితరులున్నారు.

పంచాయతీ ఆశీలు వేలం ఖరారు



ఆశీలు వేలం నిర్వహిస్తున్న దృశ్యం

కొయ్యలగూడెం: పరింపూడి పంచాయతీ పరిధిలో 2025–26 సంవత్సరానికి సంబంధించిన వారపు సంత, రోజువారీ ఆశీలు వేలం పాట శనివారం ఖరారైందని గ్రామ కార్యదర్శి కె.సురేష్ తెలిపారు. రోజువారీ మార్కెట్ వసూళ్లకు రూ.5.90 లక్షలు, వారపు సంత మార్కెట్ వసూలుకు రూ.2.60 లక్షలకు గుత్తేదారులు వేలం పాటను దక్కించుకున్నట్టు చెప్పారు. రూ.2.50 లక్షల దరావతు చెల్లించిన గుత్తేదారులకు ఆశీల వసూలుకు సంబంధించిన ఉత్తర్వుల పత్రాన్ని అందజేశామని తెలిపారు.

వైఎస్సార్ సీపీతో బడుగు వర్గాలకు గుర్తింపు



అంకాలగూడెంలో అభినందన కార్యక్రమం

కొయ్యలగూడెం: బడుగు బలహీన, అణగారిన వర్గాల వారికి గుర్తింపు నిచ్చేది వైఎస్సార్ సీపీ మాత్రమే అని పోలవరం ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ తాడిగడప రామకృష్ణ పేర్కొన్నారు. అంకాలగూడెం గ్రామంలో శనివారం రాత్రి పార్టీ ఎస్సీ సెల్ పోలవరం నియోజకవర్గ అధ్యక్షుడిగా నియమితులైన ఏలేటి చంద్రం అభినందన కార్యక్రమం ఎస్సీ సెల్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రం మాట్లాడుతూ పార్టీ పటిష్టతకు కృషి చేస్తానని చెప్పారు. పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి తెల్లం రాజ్యలక్ష్మి, మాజీ ఎంపీ, ఎమ్మెల్యేలు కోటగిరి శ్రీధర్, తెల్లం బాలరాజులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ కడకట్ల గడ్డియ్య, ఎంపీటీసీ జాన్ డేవిడ్ కింగ్, మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు దూలపల్లి కాంతారావు, మోపీదేవి వాసు, కిషోర్, తదితరులు పాల్గొన్నారు.

టూరిస్ట్ హబ్‌గా జంగారెడ్డిగూడెం

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెం పరిసర ప్రాంతాల్లో ఉన్న ప్రకృతి రమణీయతను, ప్రముఖ పుణ్యక్షేత్రాలను దృష్టిలో పెట్టుకుని రానున్న కాలంలో జంగారెడ్డిగూడెం ప్రాంతాన్ని టూరిస్టు హబ్‌గా తయారు చేస్తామని పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. శనివారం స్థానిక ఎంబీ సోషల్ క్లబ్‌లో కాసర నర్సిరెడ్డి కల్చరల్ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వాలీబాల్ పోటీలను ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గురవాయిగూడెం మద్ది ఆంజనేయస్వామి దేవస్థానం, కొంగువారిగూడెం ఎర్రకాలువ జలాశయం, జంగారెడ్డిగూడెం గోకుల పారిజాతగిరి దేవస్థానం, బుట్టాయగూడెం మండలంలో గుబ్బల మంగమ్మ ఆలయాలు ఎంతో ప్రసిద్ధి చెందాయన్నారు. ఈ ప్రాంతాన్ని టూరిస్ట్ హబ్‌గా ఎలా అభివృద్ధి చేయాలో ఎమ్మెల్యేలతో చర్చిస్తామని తెలిపారు. కార్యక్రమంలో కూటమి నేతలు పాల్గొన్నారు.



వాలీబాల్ టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న మంత్రి దుర్గేష్

రసాభాసగా టీడీపీ ఆవిర్భావ వేడుక

టి.నరసాపురం: టి.నరసాపురంలో టీడీపీ ఆవిర్భావ వేడుక శనివారం రసాభాసాగా సాగింది. నివురుగప్పిన నిప్పులా ఉన్న వర్గ విభేధాలు మరోసారి తెరపైకి వచ్చాయి. టి.నరసాపురం ప్రధాన సెంటర్‌లో ఉన్న పార్టీ జెండా వద్ద ఆవిర్భావ దినోత్సవం నిర్వహించడానికి టీడీపీ నాయకులు సన్నాహాలు చేశారు. అక్కడ ఏర్పాటు చేసిన ఫ్లెక్సీపై ఎంపీ పుట్టా మహేష్ ఫొటో లేకపోవడంతో ఒక వర్గం అభ్యంతరం తెలిపింది. దీంతో ఇరువర్గాల మధ్య వాగ్వివాదం నెలకొంది. ఇది తీవ్ర స్థాయికి చేరి తోపులాటకు దారితీసింది. అక్కడ పెట్టిన ఫ్లెక్సీని తొలగించడంతో గొడవ సర్దుమణిగింది. ట్రైకార్ చైర్మన్, పోలవరం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి బొరగం శ్రీనివాసులు పార్టీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఇరువర్గాలు పాల్గొన్నాయి.



వాగ్వివాదానికి దిగిన టీడీపీ శ్రేణులు

ఆలయాల్లో విశేష పూజలు

జంగారెడ్డిగూడెం: కొత్త అమావాస్యను పురస్కరించుకుని శనివారం స్థానిక గోకుల తిరుమల పారిజాతగిరి వేంకటేశ్వర స్వామి ఆలయంలో నిత్యకైంకర్యాలతో పాటు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు టి.నరసాపురం మండలం అల్లంచర్లకు చెందిన పసుమర్తి వెంకటేశ్వరరావు, కమల కుమారి కుటుంబీకులు అన్నప్రసాద వితరణ చేసినట్టు ఆలయ ఈఓ మానికల రాంబాబు తెలిపారు. దాతలను అర్చకులు సత్కరించారు.

- నూకాలమ్మవారు విశేష అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.



నూకాలమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

- గుర్వాయిగూడెం మద్ది ఆంజనేయస్వామి ఆలయంలో స్వామి వారికి తమలపాకులతో అష్టోత్తర పూజలు చేశారు. ముఖమండపంలో స్వామి వారి ఉత్సవ విగ్రహానికి అభిషేకాలు నిర్వహించారు. సుమారు 600 మంది భక్తులు అన్నప్రసాద వితరణ చేశామని ఆలయ ఈఓ ఆర్‌వీ చందన తెలిపారు. శనివారం పూజా టిక్కెట్లు, ప్రసాదాలు, అన్నదాన విరాళాలు రూపేణా రూ.75,600 ఆదాయం వచ్చిందన్నారు.

మహిళలకు దుస్తుల పంపిణీ

కామవరపుకోట: స్థానిక కొత్తూరు జామియా మసీదు వద్ద శనివారం 15 మంది ముస్లిం మహిళలకు షేర్, కేర్ సంస్థ ఆధ్వర్యంలో చీరలు, నగదు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మసీద్ సంఘ సభ్యుడు షేక్ ఇబ్రహీం మాట్లాడుతూ రంజాన్ మాసంలో నిరుపేదలకు దానం చేయటం ద్వారా అల్లా కరుణాకటాక్షాలు ఉంటాయని, అల్లాపై నమ్మకం పాటిస్తూ ముస్లిం మహిళలకు సహాయం అందించిన షేర్, కేర్ సంస్థ వారికి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు తమ్మిశెట్టి మోహన్, తమ్మిశెట్టి రమేష్‌బాబు, మస్జీద్ సంఘ సభ్యులు లాల్ జాన్ బాషా, నూర్ ఆలీ ఖాన్, బాబు జాన్, జవ్వాది మూర్తి, యోధ, జిలాని, వజీర్, తదితరులు పాల్గొన్నారు.



దుస్తులు అందజేసిన షేర్, కేర్ సభ్యులు

విజయరాజు పరామర్శ

కామవరపుకోట: స్థానిక కొత్తూరు ఎంపీటీసీ మేడంకి పద్మ, విజయరావు కుటుంబ సభ్యుడు మేడంకి సుబ్బారావు ఇటీవల మృతి చెందారు. ఆ కుటుంబాన్ని వైఎస్సార్ సీపీ చింతలపూడి నియోజకవర్గం కన్వీనర్ కంభం విజయరాజు శనివారం పరామర్శించారు. తన ప్రగడ సానుభూతి తెలిపారు. సుబ్బారావు కుటుంబానికి అన్ని విధాల అండగా ఉంటామని భరోసా కల్పించారు. కార్యక్రమంలో పార్టీ శ్రేణులు గుర్రాల రవికుమార్, వెర్రి శ్రీను, మెరుగు బాబురావు, బందెల ఆనంద్ ప్రభాకర్, మేడంకి బుచ్చిబాబు, ఏసు పాదం, దేవరాజు పాల్గొన్నారు.



సుబ్బారావు కుటుంబంతో విజయరాజు

బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా మూర్తి

జంగారెడ్డిగూడెం: స్థానిక బార్ అసోసియేషన్ 2025–26 నూతన కార్యవర్గం ఎన్నికైంది. ఉత్కంఠ పోరులో ప్యానల్–2పై పోటీచేసిన అభ్యర్థులు గెలుపొందారు. బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్‌గా జీఎస్‌ఆర్ మూర్తి, వైస్ ప్రెసిడెంట్‌గా మేడేపల్లి నాగులు, జనరల్ సెక్రటరీగా విత్తనాల రాజు, జాయింట్ సెక్రటరీగా ఆర్‌పీ రాజు, ట్రెజరర్‌గా మానికల సూరిబాబు, లైబ్రేరీ సెక్రటరీగా లత కుమారిలు విజయం సాధించారు. మూర్తి మాట్లాడుతూ బార్ అసోసియేషన్ అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. తన ప్యానల్ విజయానికి సహకరించిన న్యాయవాదులందరికీ కృతజ్ఞతలు తెలిపారు.



బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గం

మామిడి తోటకు వేలంపాట

కుక్కునూరు: పెద్దరావిగూడెం పంచాయతీ వెంకటాపురం గ్రామంలో ఉన్న మామిడితోటలో ఫల సాయం పొందేందుకు ఏప్రిల్ 2న పంచాయతీ కార్యాలయంలో వేలంపాట నిర్వహించనున్నట్టు తహసీల్దార్ కె.రమేష్‌బాబు శనివారం తెలిపారు. పూర్తి వివరాలకు సెల్ 89770 18664లో సంప్రదించాలన్నారు.

విద్యార్థులకు అభినందన

జంగారెడ్డిగూడెం: స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఉద్యోగ విజయోత్సవ సభ శనివారం ప్రిన్సిపాల్ సుబ్రహ్మణ్యం అధ్యతన నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న మున్సిపల్ కేవీ రమణ పాలిటెక్నిక్ విద్యార్థులకు నియామక పత్రాలను అందజేసి, అభినందించారు. విద్యార్థులు ఈ విజయాన్ని స్ఫూర్తిగా తీసుకుని ముందుకు సాగాలని సూచించారు. ప్రిన్సిపాల్ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ 2024–25 సంవత్సరానికి కళాశాలలో విద్యనభ్యసించిన విద్యార్థులు నూటికి నూరుశాతం ప్లేస్‌మెంట్‌లు సాధించారని తెలిపారు. కార్యక్రమంలో విద్యార్థులు, తల్లిదండ్రులు, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

2, 3 తేదీల్లో ఇంటర్వ్యూలు

కొయ్యలగూడెం: బీసీ, కాపు కార్పొరేషన్ రుణాల మంజూరుకు ఏప్రిల్ 2, 3 తేదీల్లో ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ కె.కిరణ్ కుమార్ పేర్కొన్నారు. 2న ఉదయం పరింపూడి, గవరవరం, చొప్పరామన్నగూడెం, మధ్యాహ్నం మంగపతిదేవిపేట, కన్నాపురం నుంచి దరఖాస్తు చేసుకున్న వారికి ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని తెలిపారు. 3న ఉదయం రామానుజపురం, వేదాంతపురం, సరిపల్లి, బయ్యన్నగూడెం, మధ్యాహ్నం పొంగుటూరు, కన్నాయిగూడెం, రాజవరం, యర్రంపేట, ఈవిడిపాలెం, కనకాద్రిపురం, కుంతలగూడెం గ్రామాల వారికి ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని పేర్కొన్నారు.

టి.నరసాపురంలో 1 నుంచి..

టి.నరసాపురం: స్వయం ఉపాధి పథకంలో దరఖాస్తు చేస్తున్న బీసీ, కాపు, ఈబీసీలకు రుణాల మంజూరు నిమిత్తం ఏప్రిల్ 1 నుంచి 3వ తేదీ వరకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని ఎంపీడీఓ మణికుమారి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో ఉదయం 10 నుంచి 5 గంటల వరకు బ్యాంకు అధికారుల సమక్షంలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. మండలంలోని 19 గ్రామాల నుంచి 1342 మంది ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేశారని, ఇంటర్వ్యూ తేదీలతో పంచాయతీ కార్యదర్శులు, వెల్ఫేర్ అసిస్టెంట్‌లు సమాచారం ఇస్తారని వివరించారు.

పోక్సో చట్టంపై అవగాహన

కొయ్యలగూడెం: స్థానిక అపోలో స్కూల్‌లో శనివారం పోక్సో చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన చైర్మన్, జూనియర్ సివిల్ జడ్జ్ సీహెచ్ కిషోర్‌కుమార్ మాట్లాడుతూ 18 సంవత్సరాల్లోపు పిల్లల సంరక్షణకు ఏర్పాటు చేసిన చట్టమే పోక్సో అని, లైంగిక వేధింపులపై టీచర్లకు లేదా తల్లితండ్రుల దృష్టికి తీసుకొస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. న్యాయవాదులు అచ్యుత శ్రీనివాసరావు, అపోలో స్కూల్ డైరెక్టర్ ఆర్.ప్రవీణ్ కుమా ర్, ఎస్సై వి.చంద్రశేఖర్, టీచర్స్, స్టూడెంట్స్ పాల్గొన్నారు.

వసంత నవరాత్రి ఉత్సవాలకు సర్వం సిద్ధం



ద్వారకాతిరుమల: శ్రీవారి క్షేత్ర దేవతగా విరాజిల్లుతోన్న కుంకుళ్లమ్మ ఆలయంలో వసంత నవరాత్రి ఉత్సవాలు ఆదివారం ప్రారంభం కానున్నాయి. తొలిరోజు అమ్మవారు లక్ష గాజుల అలంకరణలో భక్తులకు దర్శనమివ్వనున్నారు. అర్చకులు ఆలయాన్ని గాజులతో అలంకరించే పనులు శనివారం సాయంత్రం ప్రారంభించారు. ఆలయాన్ని పచ్చిపూలు, మామిడి తోరణాలు, అరటి బోదెలతో శోభాయమానంగా అలంకరించారు. వసంత నవరాత్రి ఉత్సవాలు వచ్చేనెల 7 వరకు ఆలయంలో కొనసాగుతాయని, భక్తులంతా పాల్గొనాలని ఆలయ ఈఓ ఎన్‌వీ సత్యనారాయణ మూర్తి కోరారు.

జంగారెడ్డిగూడెంలో ప్రచార జాతా

జంగారెడ్డిగూడెం: ప్రజల పక్షాన పోరాడేది కమ్యూనిస్టులే అని సీపీఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య అన్నారు. సీపీఐ శత వార్షికోత్సవ వేడుకల్లో భాగంగా చేపట్టిన రాజకీయ ప్రచార జాత శనివారం జంగారెడ్డిగూడెం చేరుకుంది. స్థానిక జేపీ సెంటర్, కొత్త బస్టాండ్ వద్ద ప్రదర్శన, ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణచైతన్య మార్చి 23న ప్రారంభమైన ప్రచారజాత, ఏప్రిల్ 14 వరకు కొనసాగుతుందన్నారు.

15 నుంచి ఏఐవైఎఫ్ సభలు

చింతలపూడి : భగత్ సింగ్ నేషనల్ ఎంప్లాయిమెంట్ గ్యారెంటీ యాక్ట్ ద్వారా దేశంలో యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించాలని సీపీఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య డిమాండ్ చేశారు. చింతలపూడి కారుమూడి సత్యనారాయణ రెడ్డి భవన్‌లో ఏఐవైఎఫ్ 17వ జాతీయ మహాసభల పోస్టర్, లోగోను శనివారం ఆయన విడుదల చేశారు. మే 15 నుంచి 18 వరకు తిరుపతి పట్నంలో నిర్వహించే ఏఐవైఎఫ్ జాతీయ మహాసభలను విజయవంతం చేయాలని కృష్ణ చైతన్య కోరారు. ఏఐవైఎఫ్ జిల్లా కోకన్వీనర్ తోర్లపాటి రాజు మాట్లాడారు.